
# ప్రకాశదీపం

## కొచ్చర్లకోట వెంకటసుబ్బారావు




నీలకంఠం గారు మరణించారన్న వార్త వినగానే వూరు వూరంతా అట్టుడుకి పోయింది. ఆ చుట్టు ప్రక్కల పల్లెలలో ఆయన పేరు ఎరుగని వారు ఉండరు. గ్రామంలో కల్లా మాంచి మోతుబరి రైతు. సంపన్నుడు. అరవయ్యోపడిలో బడ్డా క్రమం తప్పకుండా పొలం వెళ్ళడం, నాట్లు దగ్గర్నుంచి కుప్ప నూర్చేవరకు దగ్గరుండి అన్ని పనులు సవ్యంగా చేయిస్తూండటం కాలకృత్యాల్లా ఆయన చేసుకుపోతూ వుండేవాడు. అంతటి ఉక్కుపిండం అకస్మాత్తుగా చావడమా, అదీ గుండెపోటుతోనా! అసలు ఆయనకు గుండెకాయ వుందన్న సంగతి ఆయన మరణించిన తర్వాతే అందరికీ తెలిసింది. ఆయన బ్రతికి వున్నంత కాలం గుండె వుందన్న దాఖలాలు ఇతరులకు కనబడనీయ లేదు శ్వాస పీలుస్తున్నాడు కాబట్టి ఏదో మిషను ఉండకుండా పోతుందా అని అందరూ అనుకునే వారు. కానీ ఇప్పుడు గుండెపోటుతో పోవడం వల్ల ఆయనకు గుండె వుందన్న మాట రూఢి అయిపోయింది. గుండె వుందని చెప్పటానికి మరో కారణం కూడా కనబడింది. అది తర్వాత చెబుతాను.

"సహాయం అన్న మాటకు అర్థం లేదురా! ఒకడు మరొకడికి సహాయం చేయడం ఏమిటి? ఎవడి పని వాడు చేయడం అందుకు తగ్గ ప్రతిఫలం పొందటం అంతే! ఇందులో సహాయం అనే ప్రమేయం ఎందుకు? ఒకడు మరొకణ్ణి సహాయం కోరుతున్నాడంటే వీడు వాణ్ణి దోచుకోవాలని ప్రయత్నిస్తున్నాడన్న మాట. అందుకే నేను ఈ దోపిడికి లొంగను. సహాయం చెయ్యను." అంటూ నీలకంఠం గారు సాయం అర్థించిన వాళ్ల ముందు ఉపన్యాసం దంచుతూ వుండేవారు. అనుకున్న పని కాలేదే అనే దిగులు ఒక ప్రక్క ఆయన సోది వినలేక మరో ప్రక్క జనం బాధపడేవారు. ఇవేమి పట్టనట్టు ఆయన నిర్వికారంగా చెప్పుకు పోతూ వుండే వాడు.

కానీ అదేమి చిత్రమో ఆయన పట్టింది బంగారం అయ్యింది. ఆయన వరి నాటితే వరి ఆ సంవత్సరం బాగా పండేది. చెరకు నాటితే చెరకు పుష్కలంగా పండేది. ఎందరు ఎన్ని శాపనార్థాలు పెట్టినా ఆయన మీద పని చేసేవి కావు. ఒక రోగం రొష్టు లేకుండా దుక్కలా వుండేవాడు. అందరికి ఆశ్చర్యం కలిగేది. ఇంత గుండె లేని బండ వాడికి ఏ కష్టం రాదే అనుకునే వారు. కొంత మంది ఆశావాదులు "ఇప్పుడే కాదురా, చచ్చేప్పుడు చూడాలి. కుక్క చావు చస్తాడు" అనేవారు చాటుగా. మరణం కూడా సునాయాశంగా వుండటంతో "ఏ జన్మ సుకృతమో ఈ జన్మలో అనుభవించాడు. భోగిలా పుట్టాడు భోగిలా పోయాడు" అని ఇప్పుడు అనుకుంటున్నారు.

ఇలా అనుకోవడానికి కారణం లేకపోలేదు. ఆయన పోతూ పోతూ ఓ వీలునామా రాసి పోయాడు అది ఎప్పుడు రాసిందో తెలియదు గానీ ఆయన

లాయరు మాత్రం ఇప్పుడు బయట పెట్టాడు. అది విన్న జనం గుడ్లు వేళ్ల బెట్టారు ముక్కు మీద వేలు వేసుకున్నారు. "అయ్యో! ఎంత తప్పుగా అనుకున్నాం. ఆయన మారాజు. వెన్నలాంటి గుండెకాయ వున్నవాడు" అని జనం ఒకటే చెప్పుకోవడం.

"బాబయ్యా! నా కొడుకు బడికి ఎళ్తానని మారం చేస్తున్నాడు. మన అబ్బాయిగారు చదివిపారేసిన పుస్తకం ఇప్పించండి" అని ఇరవై సంవత్సరాల నాడు యింటి పాలేరు ప్రాధేయపడితే, "వాడికి చదువు ఎందుకురా? ఏం చదివినా నా కాడ పాలేరుగా వుండాల్సిందేగా" అని కసురు కున్నాడు. ధాంతో భయపడి చదువు మాన్పించి చిన్నప్పుడే కొడుకుని పాలేరుగా చేర్చాడు వెంకటేశం. ఆ వెంకటేశం కొడుకు ఇప్పుడు ఈ వీలునామా ద్వారా నీలకంఠం గారి యావత్ భూమికి అజమాయిషీ పరుడుగా అయ్యాడు.

ఒకసారి గోదావరి ముంపు వచ్చింది. గ్రామం గ్రామం జలమయం అయింది. ప్రజలు ప్రాణాలు అరచేతో పట్టుకుని నీలకంఠం గారి రెండతస్థుల మేడ ముందు నిలబడి తల దాచుకునేందుకు కాస్త చోటు యివ్వమని అడిగారు. ససేమిరా వల్లకాదు. మీరంతా వస్తే మీ శని మాకు చుట్టుకుంటుంది. మిద్దె కూలి పోతుందని విదిలించి పారేశాడు. ముంపు తగ్గిన తర్వాత సర్కారు వారు నది ఒడ్డు ఎత్తు చేయాలి అని తలపెట్టి నీలకంఠం గారి సాయం కోరితే అసలికే మోసం వచ్చేట్టు ఆ పని నీరు కార్చాడు. అటువంటి వాడు ఇప్పుడు 5 లక్షల ఖర్చుతో గ్రామం చుట్టూరా నదీ జలం వరదల సమయంలో తోసుకు రాకుండా వుండేందుకు కట్ట వెయ్యాల్సిందంటూ విల్లులో రాసి పోయాడు. అందుకు తగిన ప్లైకం కూడా సిద్ధం చేసి పోయాడు.

ఇలా ఎన్నో విషయాలు పొంతన లేకుండా కనబడుతూంటే ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. నీలకంఠం గారు యావదాస్తిని గ్రామానికి అంకితం చేశారు. ఓ ట్రస్టును ఏర్పాటు చేసి ప్రజా శ్రేయస్సుకు సంబంధించిన పనులు ఆ ట్రస్టుకు అప్పగించారు. గ్రామంలో ఓ జూనియర్ కాలేజీ తెరవడం, పేదలకు ఉచిత భోజన వసతితో చదువు నేర్పటం, ఇలా చాలా విషయాలు రాసారు. అన్నిటికంటే విచిత్రం ఆయన శ్రాద్ధ కర్మలు గ్రామ ప్రజలు అందరూ కలిసి చేయాలని రాసి వుండటం.

ఇంతకీ నీలకంఠం గారు సంతానహీనుడా అంటే కాదు. కొడుకు లక్షణంగా ఎమ్. బి. ఏ. చదివి ఫారెన్‌లో వుంటున్నాడు కూతురు ఓ డాక్టరుని పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయింది. మరి వారికి ఆస్థి చెందకుండా ఎందుకిలా చేశాడు అనే మీమాంస వచ్చింది. దీని ఆంతర్యం వీలునామాలో ఎక్కడా రాసి లేదు లోతుగా ఆలోచిస్తే అందరికి బోధపడిన విషయం ఒక్కటే.

నీలకంఠం గారు జీవితాంతం గడ్డితిని గడించాడు. కొడుకుని ప్రయోజకుణ్ని చేశాడు. కూతురుని మరో ప్రయోజకుడికి యిచ్చి విదేశాలకు సాగనంపాడు తను వంటరిగా బ్రతుకు ఈడుస్తూ ఆలోచించి వుంటాడు. ఏమిటి ఈ జీవిత ధ్యేయం? తన దంటూ ఓ చిన్న ప్రపంచం ఏర్పాటు చేసుకుని దాని అభివృద్ధికి కష్టపడటం, కొడుకూ, కూతుళ్లకు నిచ్చెనలా వుపయోగ పడుటమేనా? ఇంత మమకారంతో పెంచిన సంతానం నా అవసాన దశలో ఎదురుగా లేకుండా పోయారు. తోడుగా వుండాల్సిన భార్య ముందుగానే పోయింది. ఇహ మిగిలింది ఎవరు? నా చుట్టూ వున్న ఈ గ్రామ ప్రజలు. వీళ్లే నా నిజమైన సంతానం, నా వాళ్లు. నన్ను నమ్ముకున్న వాళ్లు. కాబట్టి నా ఆస్తి అంతా వీళ్లకు చెందాలి. అంతేగానీ అమెరికాలో వుంటున్న కూతురికీ, కొడుకుకి కాదు. వాళ్లు నేను చచ్చిన మర్నాడు ఆస్తి నంతటిని తెగ నమ్మి అమెరికాకు పట్టుకు బోతారు. అక్కడ నీలకంఠం అనే వ్యక్తి గురించి తలిచే నాథుడు వుండడు ఎక్కడో వుంటున్న కొడుకు కూతురు పేరా గ్రామంలో ఆస్తి రాయడమంటే అది నిజంగా కుక్కచావు అలా చేయ్య కూడదు గ్రామానికి సంబంధించిన ఆస్తి గ్రామానికే దక్కాలి ఏ పట్టణానికో, మరో దేశానికో ధారాదత్తం కాకూడదు 'నీలకంఠం గారి ఔదార్యం, ముందు చూపు తలచుకుని గ్రామ ప్రజల కళ్లు చెమ్మగిల్లాయి. ఈ నాటికి ఆయన నిలువెత్తు విగ్రహం వూరి మధ్యలో దర్శన మిస్తూ ఆకాశదీపంలా ఎందరికో దారి చూపుతూంటుంది □


## కరువు రక్కసిని దృఢ చిత్తంతో, బాధ్యతతో ఎదుర్కొందాం!

### ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి ఉదారంగా విరాళాలివ్వండి

విరాళాలను కార్యదర్శి, ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి, ప్రధానమంత్రి కార్యాలయం, సౌత్ బ్లాక్, న్యూఢిల్లీ-110 011 అను చిరునామాకు పంపవచ్చును.

ప్రజా ప్రయోజనం కోసం ప్రకటన జారీ చేసినవారు
ది ఇండియన్ & ఈస్టర్న్ న్యూస్ పేపర్ సొసైటి